



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



గవర్నర్‌కు ఎంపీతో కలిసి వినతి పత్రాన్ని అందజేస్తున్న గిరిజన సంఘ నేతలు

గవర్నర్‌ను కలిసిన ఎంపీ నగేష్

ఆదిలాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్‌ను ఎంపీ గోడం నగేష్ మర్యాద పూర్వకంగా రాజ్‌భవన్‌లో బుధవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. 5వ షెడ్యూల్ పరిధిలోని పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేకంగా చర్చించారు. అలాగే ఆదిలాబాద్ ఏజెన్సీలో పర్యటించి ఆదివాసీ గిరిజనుల సమస్యలను తెలుసుకోవాలని గవర్నర్‌ను కోరారు. స్పందించిన గవర్నర్ వర్షాకాలం ముగిసిన తర్వాత జిల్లాలో పర్యటిస్తానన్నట్లు తెలిపారు. అనంతరం గిరిజన ఉద్యోగ సంఘ నేతలు ఏజెన్సీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై ఎంపీతో కలిసి గవర్నర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

టీకాలతో వ్యాధులు దూరం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పిల్లలకు వ్యాక్సిన్ వేయడం వల్ల 11రకాల వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వైసి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్ అర్బన్ పీహెచ్‌సీలో జాతీయ టీకాల కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ం డాక్టర్ సాధనతో కలిసి ప్రారంభించారు. టీకాలు వేసే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, టీకాలతో కలిగే లాభాలను వివరించారు. అనతరం ఇమ్యూనైజేషన్ అధికారి మాట్లాడుతూ పిల్లల్లో వివిధ వ్యాధులు రాకుండా ప్రభుత్వం ఉచితంగా అందించే టీకాలను తప్పనిసరిగా వేయించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు ఇఫ్రాత్, సీవో కేమ రాజారెడ్డి, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నేరడిగొండ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం వైద్యాధికారి సద్దాం ఆధ్వర్యంలో బుధవారం స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. వర్షాకాలం నేపథ్యంలో జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, హెచ్‌వో పవార్ రవీందర్, సంతోష్, వైష్ణవి, గంగామణి, తదితరులు ఉన్నారు.



● పత్తి పంటలో దౌర కొడుతున్న రైతులు


ధీమానివ్వని.. బీమా!

- జిల్లాలో రైతు బీమాకు దూరమవుతున్న కౌలు రైతులు
- ఎలాంటి ఆధారం లేక అందని రాష్ట్ర ప్రభుత్వ సహాయం
- కుటుంబ పెద్దను కోల్పోయి రోడ్డున పడుతున్న కుటుంబాలు
- రైతు బీమా పథకంలో కౌలు రైతులను చేర్చాలంటూ డిమాండ్లు
- ముగిసిన బీమా దరఖాస్తుల గడువు
- జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 28,763 మంది కౌలు రైతులు

ఆదిలాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం కౌలురైతుల ధరికి చేరడం లేదు. ఎన్నికలకు ముందు కౌలు రైతులను ఆదుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చిన అమలుకు మాత్రం నోచుకోవడం లేదంటున్నారు. ఇతర రంగాల్లో కనీస పరిజ్ఞానం లేని కౌలు రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఏదైనా జరగకూడని ప్రమాదం జరిగితే కౌలు రైతుల కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నాయి. భూపట్టా పాస్‌బుక్ కలిగి ఉండి ఏ కారణం చేతనైనా రైతులు మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు గత ప్రభుత్వ హయాంలో రైతుబీమా పథకానికి శ్రీకారం చుట్టారు. దీనిని 2018 ఆగస్టు 15 నుంచి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. ప్రభుత్వమే రైతుల పేరిటా ఎల్‌ఐసీకి పాలసీ సొమ్మును చెల్లిస్తూ రైతు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని అందించే విధంగా ఏర్పాట్లు చేశారు. అయితే ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ.. ఎలాంటి భూపట్టా ఆధారం లేని కౌలు రైతులు ఈ పథకానికి నోచుకోవడం లేదు. ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, బ్యాంకు రుణాలు, ఇతర సంక్షేమ పథకాలు కౌలు రైతులకు అందడం లేదు. జిల్లాలో 28,763 మంది కౌలు రైతులు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ప్రతీ యేడూ జిల్లాలో అప్పుల బాధలు, ఇతర ప్రమాదాలు, అనారోగ్య భారీన పడి 650 నుంచి 700 మంది రైతులు మరణిస్తున్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. అయితే ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల్లో అధికంగా కౌలు రైతులే కావడం మరింత ఆందోళన రేపుతుంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటలను నష్టపోతున్న ప్రభుత్వం ఆదుకోవడం లేదని కౌలురైతులు వాపోతున్నారు.

ముగిసిన గడువు

ఆగస్టు 8 నుంచి 13 వరకు కొత్త పట్టాపాస్ బుక్ కలిగిన రైతులకు రైతు బీమా నమోదు కోసం ప్రభుత్వం అవకాశం కల్పించింది. జిల్లాలో లక్షా 68వేల 610 భూ పట్టాపాస్‌బుక్‌లు ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు లక్షా 15వేల 291 మంది రైతులు రైతు బీమా కోసం ఎన్‌రోల్ చేసుకున్నారు. కొత్తగా మరో 3,729 పట్టాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో ఆగస్టు 13 సాయత్రం వరకు 3,358 కొత్తగా పట్టాలు కలిగిన రైతులను రైతు బీమా పథకంలో ఎన్‌రోల్ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఇందులో ఏ ఒక్క కౌలు రైతుకు అవకాశమే దక్కలేదు. ఎలాంటి ఆధారం లేదన్న కారణంగా కౌలు రైతుల దరఖాస్తులను అధికారులు నిరాకరిస్తున్నారు. దీంతో రైతు బీమాకు కౌలు రైతులు దూరమవుతున్నారు.



కనీస గుర్తింపు కరువు

భూమిపై కౌలు రైతులకు ఎలాంటి హక్కులు లేకపోవడం తో ప్రభుత్వ పథకాలన్నీ భూ యజమానులకే దక్కుతున్నాయి. పంట నష్ట పరిహారం కూడా యజమానుల ఖాతాల్లోకే నేరుగా వెళ్తుంది. పంటను అమ్ముకోవాలన్న యజమానుల అనుమతులు తప్పనిసరిగా మారింది. పేరుకే పంటలను

(తరువాయి 6వ పేజీలో...)

కౌలు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

: సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు



కౌలు రైతుల కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలి. జిల్లాలో ఎక్కువగా కౌలు రైతులే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇతర రైతుల మాదిరిగానే కౌలు రైతులకు రైతు బీమా వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కౌలు రైతుల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్న ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. ఎన్నికల సమయంలోనే కౌలు రతులు గుర్తుకొస్తున్న ఆ తర్వాత ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు మర్చిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కౌలు రైతులకు అన్ని రకాల పథకాలను వర్తింప చేయాలి.

ఎలాంటి ఆదేశాలు లేవు

: శ్రీధర్‌స్వామి, జేడీఏ, ఆదిలాబాద్



కౌలు రైతులకు రైతు బీమా, రైతుబంధు, ఇతర సబ్సిడీ పథకాలను అందించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. భూపట్టా పాస్ పుస్తకం లేనందున కౌలు రైతుల దరఖాస్తులు తీసుకోవడం లేదు. ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఆదివాసీల నోవొంగ్ పూజలు

బజార్‌హత్నూర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం(పంగిడి) గ్రామ శివారులో వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఆదివాసీ సిడాం పరివారం ఆధ్వర్యంలో నోవొంగ్ ప్రత్యేక పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. ప్రతీ యేడాది పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ఈ ప్రత్యేక పూజలు చేయడం అనవాయితీగా వస్తుందని సిడాం పరివారం పటేల్ సిడాం మాణిక్‌రావ్ తెలిపారు. ఈ సందర్భంగా దేవతలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఈ పూజల తరువాతే పంటల నుంచి ధాన్యాలను ఉపయోగిస్తామని ఈ సందర్భంగా వివరించారు. వారితో హీరాలాల్, సకారం, శంభు, మహాద్ రావు, గుణవంత్ రావు, తదితరులున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరేడిగొండ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున బోథ్ నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. ప్రజలు, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదన్నారు. అవసరం అయితే తప్ప ఎవరూ బయటికి రావొద్దన్నారు. అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండాలన్నారు.

ఇంద్రవెల్లి: రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గ్రామీణ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీవో జీవన్‌రెడ్డిలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రమాదకరంగా ఉన్న వాగులు, చెరువుల వివరాలను తెలుసుకున్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకుండా ఉండే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకంలో భాగంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో స్థలాలను గుర్తించి, నివేదిక అందించాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు.

జిల్లాలో భారీ వర్షం

- అత్యధికంగా ఉట్నూర్‌లో 77.1 మి.మీ.ల వర్షపాతం నమోదు
- సాత్నాల ప్రాజెక్టు గేటును ఎత్తి నీటిని వదులుతున్న అధికారులు
- వరద నీటితో ఉప్పొంగుతున్నవాగులు
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు

మరిన్ని వివరాలు 7వ పేజీలో....

జాలువారుతున్న 'కుంటాల'

నేరడిగొండ: వానాకాలంలో వెల్లువెత్తే నీటిని సొగసుగా జాలువార్చే కుంటాల జలపాతమిది. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలో ఉన్న ఈ జలపాతం రాష్ట్రంలోనే పెద్దది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు, వాగులు, వంకలు ఏకమై జలపాతానికి చేరుకుంటున్నాయి. చిన్నగా మొదలైన నీటి ప్రవాహం హోరుమంటూ ఉధృతంగా మారుతోంది. దీంతో జలపాతం అందాలను తిలకించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు.



పరవళ్లు తొక్కుతున్న కుంటాల జలపాతం

ఉప్పొంగిన 'పొచ్చెర'

బోథ్: బోథ్ ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో పొచ్చెర జలపాతానికి వరదనీరు పోటెత్తడంతో జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తోంది. అయితే జలపాతం అందాలను తిలకించేందుకు పర్యాటకులకు అనుమతి ఇవ్వలేదు. జలపాతం రోడ్డుపైన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పర్యాటకులు లోపలికి వెళ్లకుండా కట్టడి చేశారు. అలాగే మండలంలో భారీ వర్షాలు కురవడంతో కరత్వాడ చెరువు నిండింది. దీంతో చెరువు అలుగు పైనుంచి నీరు పోస్తోంది.



ఉప్పొంగి ప్రవహిస్తున్న పొచ్చెర జలపాతం



పూర్తిగా వరదనీటితో నిండిపోయిన ఇచ్చోడ శ్మశాన వాటిక

వరదనీటిలో వైకుంఠధామం

ఇచ్చోడ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో అంతిమసమయంలో మనిషి గమ్యస్థానమైన వైకుంఠధామం వరదలో చిక్కుకుంటుంది. మోస్తారు వానొస్తే చాలు ఆ వైకుంఠధామాకి వెళ్లాలంటేనే గగనం. ఏదైనా విషాద సంఘటన జరిగి ఆరోజు వాన కురిస్తే ఇక అటువైపు వెళ్లడం కష్టాల కడలిలో ఈదడమే.. ఈ వైకుంఠధామం ఎక్కడో కాదు.. మేజర్ గ్రామపంచాయితీ ఇచ్చోడ పట్టణంలో ఉండడం గమనార్హం.



వాగు వద్ద ఏర్పాటు చేసిన భారీకేడ్‌తో పోలీసులు

వాగుల వద్ద భద్రతా చర్యలు

బోథ్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కల వాడ వాగు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో స్థానిక సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై శ్రీసాయిలు కలిసి నక్కలవాడ వద్ద బయట వైపు దాటకుండా బారీకేడ్ ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టారు. అంతేగాక వరద ఉధృతి సమయంలో వారిని దాటవద్దని సూచించారు. గతంలో వాగు ఉధృతి ఉన్న సమయంలో వాగు దాటి ఇరువురు ఆదివాసులు మృతి చెందిన జరిగింది. అప్పటి నుంచి వరద వచ్చిందంటే పోలీసు అధికారులు బ్రిడ్జి వద్దకు చేరుకొని తగు సూచనలు చేస్తున్నారు.

నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన ప్రధాన నిందితుడి అరెస్టు

- జవాడే కృష్ణ రిమాండ్‌కు తరలింపు
- రూ.9 లక్షల నగదు, ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ

6లో...

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం

● గంజాయి సేవించినా, విక్రయించినా చర్యలు : కలెక్టర్ ● ఇందిరా ప్రియదర్శిని మైదానంలో 'నషా ముక్త్ భారత్‌పై అవగాహన

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు బానిసగా మారితే జీవితం అంధకారంగా మారుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో బుధవారం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడా పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సేవనంతో ఆరోగ్యం క్షీణించి, ఏకాగ్రత పూర్తిగా తగ్గుతుందని, భవిష్యత్తు నాశనమవుతుందని అన్నారు. గంజాయి సేవించినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గంజాయి సాగు చేస్తే రైతు బంధుతో పాటు ఇతర పథకాలను నిలిపివేస్తామని పేర్కొన్నారు. డీఎంహెచ్‌ం డాక్టర్ నరేందర్ రాథోడ్, డీవైఎస్‌ం జక్కుల శ్రీనివాస్, డీఎం శ్రీధర్, డీఐఈం గణేష్ పాల్గొన్నారు.



● విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

● విద్యార్థుల చేత మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

ఉట్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మాదకద్రవ్యాల నిరోధకానికి కృషి చేయాలంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బుధవారం ఉట్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మారక ద్రవ్య నిరోధక ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ ధనరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగం వలన ఎన్నో అనర్థాలు ఉన్నాయంటూ విద్యార్థులకు మార్గదర్శకం చేసిన అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు శ్రీనివాస్‌రావు, సువర్ణ, శ్రీలత, గణేష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని సుంకిడి జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాలలో బుధవారం నిషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా అవగాహన నిర్వహించారు. విద్యార్థులు సమాజంలో మాదకద్రవ్యాల నిరోధం కోసం కృషి చేయాలని ప్రదానోపాధ్యాయుడు శ్రీనివాస్‌స్వామి పిలుపు నిచ్చారు. మాదక ద్రవ్య నిరోధక ప్రతిజ్ఞలో భాగంగా పాఠశాల యందు విద్యార్థులచే సామూహిక ప్రతిజ్ఞ చేయించారు.



ఉట్నూర్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకుడు

నకిలీ డాక్యుమెంట్ సృష్టించిన నలుగురి అరెస్టు

- 8 మందిపై కేసు నమోదు
- డీఎస్పీ జీవన్‌రెడ్డి వివరాల వెల్లడి

మావల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు సృష్టించి భూమి కబ్జా చేసిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మావల పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని సర్వే నెం.170లోని 905 ప్లాట్ నెంబర్‌ను క్రాంతినగర్‌కి చెందిన స్వామికి 2023లో ప్రభుత్వం పట్టా ఇచ్చింది. అయితే స్వామి అందులో ఓ గుడిసె వేసుకొని ఉంచాడు. ఇల్లు నిర్మాణం కోసం మావల గ్రామ పంచాయతీ నుంచి పర్మిషన్ సైతం తీసుకున్నాడు. ఈ క్రమంలో స్వామి అనారోగ్యం బారిన పడటంతో ఇంటి నిర్మాణం చేయక గుడిసె వైపు వెళ్లడం మానేశాడు. పసిగట్టిన కబ్జాదారులు రహీమ్ ఖాన్, పవన్ నాయక్‌లు నకిలీ పత్రాలు సృష్టించారు. వారి నుంచి సుంకరి వెంకటమ్మ సంతోష్ రెండున్నర లక్షలకు కొనుగోలు చేసింది. అనంతరం వెంకటమ్మ రూ.3 లక్షలు ధర రావడంతో కిష్టన్నా అనే వ్యక్తికి అమ్మింది. కాగా స్వామి తన ప్లాట్ దగ్గరికి వచ్చి వారిని ప్రశ్నించడంతో కబ్జాదారులు బెదరించారు. దీంతో బాధితుడు స్వామి జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో మావల పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో నకిలీ పత్రాలను సృష్టించి కబ్జా చేసినట్లు తేలిందన్నారు. ఈ మేరకు ఈ కేసులో నలుగురిని అరెస్టు చేయగా మిగతా నలుగురు పరారిలో ఉన్నారని తెలిపారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే డయల్ 100 ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. భూ కబ్జాలకు పాల్పడే వారిపై జిల్లా పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతుందన్నారు. ఈ సమావేశంలో మావల సిఐ స్వామి కర్రే, ఎస్సై రాజశేఖర్ రెడ్డిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

ఏజెన్సీ ప్రాంతంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి : డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఇచ్చోడ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన గ్రామాలలో గల నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన ఆదేశించారు. ఇచ్చోడ పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా ఆమె తనఖీ చేసి పలు వార్డులు, రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గర్భిణులు ఆసుపత్రిలో చేరిన దగ్గరి నుంచి సురక్షితమైన కాన్పు అయి ఇంటికి వెళ్లే వరకు ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.పీహెచ్‌సీ వైద్యుడు కిరణ్ కుమార్, వైద్యురాలు మధురిమ, వైద్యసిబ్బంది కైలాష్, సుభాష్, సుధారాణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు ముఖ్య అతిథిగా షబ్బీర్ అలీ

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈమేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. పట్టణంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించనున్న వేడుకలకు అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది.

టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ టూ టౌన్ సీఐగా కె.నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఆయన ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాదపూర్వకంగా కలవగా.. ఆయనకు ఎస్పీ పలు సూచనలు చేశారు. ఇది వరకు సీఐగా కొనసాగిన సీహెచ్ కరుణాకర్ రావు భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్‌కు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ కాగా.. మెదక్ సీసీఎస్ నుంచి ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు బదిలీపై వచ్చారు.

'సౌర విద్యుత్‌కు భవనాలను గుర్తించాలి'

బోథ్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ఉత్పత్తికి అనువైన ప్రభుత్వ భవనాలను గుర్తించాలని అందుకు అవసరమయ్యే సోలార్ ప్యానల్ బిగించేందుకు అనువైన పాఠశాల భవనాలను గుర్తించాలని ఎంపీడీవో రమేష్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో మండలంలోని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ సెక్రటరీలు, ఉపాధి హామీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈనెల 17వ తేదీలోపు భవనాలను గుర్తించాలని ఆయన కోరారు. ఎంఈవో హుస్సేన్, ఎంపీవో కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ఏర్పాటు చేయాలని వినతి

ఉట్నూర్, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఏజెన్సీలోని దళిత విద్యార్థుల ఉట్నూర్ మండల కేంద్రంలో పోస్టుమెట్రిక్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని మాదిగ కుల సంఘం అధ్యక్షుడు కొల్లూరిలింగన్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ని కోరారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంఘం నాయకుల ఆధ్వర్యంలో కలిసి సమస్యలు వివరించామన్నారు. మాదిగ కులస్థుల అవసరాల కోసం కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, దళిత విద్యార్థుల పోస్టుమెట్రిక్ హాస్టల్, రాజీవ్ యువ కిరణాలలో, మాదిగలకు ప్రాధాన్యత, ఇండ్లులేని మాదిగలకు ఇందిరమ్మ ఇండ్లు, మొదలైన అవసరాలు ఉన్నాయని వివరించడంతో ఎమ్మెల్యే బొజ్జుపటేల్ స్పందించి త్వరలోనే సమస్యలకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చినట్లు లింగన్న వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతరావు, గుడిసెల సలోమోన్, వెల్పేల జైరాజ్, నాతరిపోషన్న, కొల్లూరి స్వామి, నాతారి రాజు,కొమ్మురవి, గుడిసెల మహేశ్, నాతారినరేష్, నాతారి మల్లేష్, పోడేటి ప్రశాంత్, దొనకొండ ప్రశాంత్, ఇంటూరి ప్రసాద్ పాల్గొన్నారు.

'ఆదిలాబాద్‌లో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి'

నేరడిగొండ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని గళమెత్తుతూ ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా వైస్‌చైర్మన్ రాథోడ్ సందీప్ ఆధ్వర్యంలో బుధవారం నేరడిగొండ మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. అనంతరం నేరడిగొండ తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ కలీంకు వినతిపత్రం అందజేసి, యూనివర్సిటీ ఏర్పాటు అత్యవసరమని కోరారు. కార్యక్రమంలో నేరడిగొండ మండల చైర్మన్ నర్సింగ్ దాస్, వైస్ చైర్మన్ సతీష్, కోఆర్డినేటర్ కృష్ణ, సాబ్లే సంతోష్ సింగ్, వినీష్, ప్రశాంత్, ఒ. రాజు, కృష్ణ, సతీష్, మహేందర్, షైపాల్ తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు పాఠశాలలో వృక్షా బంధన్

తలమడుగు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో వృక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వెంకట్రావు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని అరిగట్టేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యత తెలిసేందుకు పాఠశాలలో హరితహారం ద్వారా మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు వృక్షాబంధన్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మొక్కలను దత్తత ఇవ్వడం జరిగిందన్నారు. దత్తత తీసుకున్న మొక్కలను సంరక్షించే బాధ్యత విద్యార్థులదన్నారు. అనంతరం మొక్కలకు, వృక్షాలకు రాఖీలు కట్టి పాఠశాలలో వృక్షాబంధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో సీనియర్ ఉపాధ్యాయులు వై వినోద్ రెడ్డి, చంద్రమ్మ, రాకేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

నేరడిగొండ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని డిప్యూటీ తహసీల్దార్ మాడవి విశ్వనాథ్ అన్నారు. బుధవారం నేరడిగొండ మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మాడవి విశ్వనాథ్‌ను గిరిజన లంబాడీల ఐక్యవేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా మహేందర్ జాదవ్ మాట్లాడుతూ ఆదివాసి గిరిజన విద్యార్థుల కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఆపకుండా వెంటనే జారీ చేయాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపిటిసి కృష్ణ, వినేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి'

ఇంద్రవెల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక గురువు శ్రీ సంత్ భగవాన్ బాబా సూచించిన ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక రాధాకృష్ణ ఆలయంలో వంజరి కులస్తుల ఆధ్వర్యంలో శ్రీ సంత్ భగవాన్ బాబా 129వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సబ్బండ జాతులకు సమస్త మానవాళికి ఆరాధ్యుడని కొనియాడారు.

డబ్బులు వసూలు చేసిన నిందితుడి అరెస్టు

- రూ.9 లక్షల నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం
- ఎస్పీ అఖిల్ మహాజన్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మైక్రోఫైనాన్స్ పేరిట నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన ప్రధాన నిందితుడు జవాడే కృష్ణను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు అంగన్‌వాడీ లలో ఉద్యోగాలు ఇప్పిస్తనంటూ ప్రధాన నిందితుడు దాదాపు మూడు వందల మంది నిరుద్యోగుల నుంచి రూ.20 వేల చొప్పున నగదును వసూలు చేశాడు. మోసపోయామని గ్రహించిన నిరుద్యోగులు కార్యాలయాల ఎదుట నిరసన తెలపడంతో కుట్ర వెలుగులోకి వచ్చింది. ఆదిలాబాద్ పట్టణంతో పాటు... ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, జైనథ్, మావలలో పదహారు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో పోలీసులు నిందితుడిని అరెస్టు చేయగా... స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని కేసు వివరాలను వెల్లడించారు. ఎన్నారై పేరుతో ప్రముఖులను పరిచయం చేసుకుని ఎస్.కే మైక్రో ఫైనాన్స్ పేరుతో కార్యాలయాలను లాంచనంగా ప్రారంభించిన ప్రధాన నిందితుడు జవాడే కృష్ణ.. దాదాపు మూడు వందల మంది నుంచి మెంబర్షిప్ కింద రూ.20 వేలు వసూలు చేశాడని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.54 లక్షలు, ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాల పేరుతో రూ.15 లక్షలు వసూలు చేసి మొత్తం రూ.69 లక్షల వసూలు చేసనిట్టు విచారణలో తేలిందని తెలిపారు. గతేడాది డిసెంబర్ నుంచి ఆరు నెలల పాటు నగదు వసూలు చేసి ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో బాధితులు తరచూ ప్రశ్నించగా.... ఈ ఏడు జులై నెల మొదటి వారంలో తన సొంత గ్రామం శంకరగుడాలో తొమ్మిది లక్షల నగదు, మూడు లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు దాచి, 15 లక్షల నగదుతో పారిపోయాడన్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి నిందితుడిని పట్టుకోగా... అతడి నుంచి రూ.9 లక్షల నగదు, పది తులాల 70 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజల దగ్గర దోచుకున్న డబ్బులతో బంగారు ఆభరణాలు, కారు కొన్నారన్నారు. ప్రధాన నిందితుడి తమ్ముడు జవాడే గోపాల్ తో పాటు... ఏజెంట్లుగా వ్యవహరించిన ఆత్రం నారాయణ, డాకురే శత్రుఘన్, మధ్యవర్ ఆదినాథ్ లను అరెస్టు చేశామని, ఆత్రం రాహుల్, మిశ్రమ ప్రహ్లాద్ పరారీలో ఉన్నారన్నారు. బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నట్లయితే జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఉట్నూర్ సీఐ ఎం.ప్రసాద్, ఐటీ కోర్ ఎస్సై గోపికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ఉత్సవ సమితి సభ్యులకు సన్మానం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పండగల ప్రాధాన్యతను తెలియచెప్పేలా సమితి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి తెలిపారు. బుధవారం పట్టణంలోని శ్రీ రామచంద్ర గోపాల కృష్ణమటం లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సిములు, మీసాల స్వామి, కోశాధికారి దశరథ్, సమితి సభ్యులు గేడం మాధవ్, రవీందర్, సూర్యకాంత్, సంతోష్ అగర్వాల్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్లు వయోవృద్ధులు, విశ్రాంత ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సైబర్ డీఎస్పీ హసీబుల్ల తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజెన్ కార్యాలయంలో బుధవారం సైబర్ నేరాలపై వయో వృద్ధులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సీఐ సురేందర్, వయో వృద్ధుల సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, ఎఫ్ఆర్ం పోశెట్టి, రాష్ట్ర కో ఆర్డినేటర్ సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ సెక్రెటరీగా సుశ్రుత్‌రెడ్డి

నేరడిగొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తేజాపూర్ గ్రామానికి చెందిన యువ సామాజిక సేవకుడు నానిరెడ్డి (నానిరెడ్డి) నేషనల్ హ్యూమన్ రైట్స్‌కమిటీ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షులు బద్దం పురుషోత్తంరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. సామాజిక సమస్యల పరిష్కారం, పేదలకు న్యాయం సాధించడంలో ముందుండే సుశ్రుత్‌రెడ్డి ఇప్పటి వరకు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

బోథ్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హనుమాన్ వాడ ఉపాధ్యాయురాలు ఆ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను అందించారు. కార్యక్రమం కాలనీవాసులు రాములు, సింగం రమణ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో వ్యక్తి ఆత్మహత్యయత్నం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోట పురుషోత్తం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్త కుమ్మరి వాడలోని గౌర మ్మబట్టికి చెందిన తోట పురుషోత్తం(28) బుధ వారం ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన కలకలం రేపింది. ఉట్నూర్ మండలం హస్నాపూర్‌లో ఉన్న తన భూమిని ఇప్పించాలంటూ అతను గొంతు కోసుకున్నాడు. పోలీసులు వెంటనే అతనిని రిమ్స్‌కు తరలించారు. తోట పురుషోత్తం గతంలోనూ ఇదే మాదిరిగా గొంతు కోసుకొని భయపెట్టే యత్నం చేసినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. ప్రస్తుతం అతనిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నేరడిగొండ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన సోలాంకి శ్రీకాంత్ (26) అనే వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ ఇమ్రాన్ సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా తన ఇంట్లో ఉరి వేసుకున్నాడని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్న సమయంలో అతని భార్య మౌనిక తీజ్ పండుగ కోసం అదే గ్రామంలో గల తల్లిగారింటికి వెళ్ళిందన్నారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ధీమానివ్వని.. బీమా!

(5వ పేజీ తరువాయి...)

సాగు చేస్తున్న కౌలు రైతుకు అసలు గుర్తింపే లేకుండా పోతుంది. ప్రతి యేటా జూన్ మాసంలో కౌలు రైతులను గుర్తించి వారికి బ్యాంకు రుణాలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. కాని రైతు బీమా పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 5వేల మందికి పైగా రైతులకు బీమా సొమ్మును అందించిన ప్రభుత్వం ఏ ఒక్క కౌలు రైతును ఆర్థికంగా ఆదుకున్న దాఖలాలు లేవు. కనీసం పండించిన పంటలనైనా మార్కెట్లో నేరుగా అమ్ముకునే పరిస్థితి లేదంటే కౌలు రైతుల పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో తెలుస్తునే ఉంది. భూ యజమానులు కనీసం ఒప్పంద పత్రాలనైనా రాసి ఇచ్చేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తుంది.

కోలుకోలేని దెబ్బ

వ్యవసాయ పనుల్లో ఉండగా ప్రమాదవశాత్తు మరణిస్తున్న కౌలు రైతుల కుటుంబాలు అనాధలుగా మారుతున్నాయి. పెద్ద దిక్కునే కోల్పోయి కౌలు రైతు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.కుటుంబాన్ని పోషించే వారే లేకపోవడంతో ఆ భారమంతా మహిళలపై పడి కోలుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. పంటల సాగు చేసే పరిస్థితిలేక కుటుంబమంతా కూలీ పనులు చేసుకోవాల్సి వస్తుంది. అలాగే కొంత మంది విద్యార్థులు ఆర్థిక స్థోమత లేక మధ్యలోనే చదువులను నిలిపి వేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. పలు రకాల ఇబ్బందులతో కౌలు రైతు కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడుతున్న ప్రభుత్వానికి కనికరమే లేకుండా పోతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అప్పులు తీర్చేందుకు గుంట భూమి కూడా లేకపోవడంతో రెక్కల కష్టాన్నే నమ్ముకుంటున్నారు. పేదరికం, ప్రకృతి వైపరీత్యాలు వెంటాడడంతో కౌలు రైతు కుటుంబాలు కడుదయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ఉట్నూర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాపూర్‌కు చెందిన అర్కగంగారాం (40) గత ఆదివారం అదృశ్యం కాగా బుధవారం పత్తి పంట చేనులోని పొదల్లో శవం బయటపడిందని ఉట్నూర్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గత ఆదివారం భార్యభర్తల మధ్య చిన్న గొడవ జరగడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన గంగారాం అదృశ్యం అయ్యాడని, కనిపించడం లేదని మృతుడి భార్య తిరుమల మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. గంగాపూర్ పరిసరాలలోని పత్తి చేను పొదల్లో శవం కనిపించడంతో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించామని ఎలా మృతి చెందాడో పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత తెలుస్తుందని అన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని కచ్‌కంటి గ్రామానికి చెందిన ఆవారిదత్తు(38) కనబడడం లేదని ఫిర్యాదు అందినట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కచ్‌కంటి గ్రామానికి చెందిన అవారిదత్తు 11/08/2025 మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని వారి కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని వారు తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసుకుని విచారణ జరుగుతున్నట్లు తెలిపారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే తమకు తెలుపగలరని కోరారు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు ఐదేళ్ల జైలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : భార్యపై హత్యాయత్నం చేసిన కేసులో భర్తకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావు తీర్పు వెలువరించారు. మావల సీఐ కర్రె స్వామి తెలిపిన వివరాల ప్రకారం... పిట్టలవాడ కు చెందిన జాదవ్ ఆనంద రావు గతేడాది డిసెంబర్ 18 న తన భార్యను సుత్తితో తలపై బాది తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కోర్ట్ డ్యూటీ అధికారి సీ.హెచ్ సంతోష్ పది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా.. పీపీ ఏ.ఆర్. రెహమాన్ కేసు వాదించారు. నేరం రుజువైనందున ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

జిల్లాలో పలు మెడికల్ షాపుల తనిఖీ

నిర్మల్ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు మెడికల్ షాపులను తనిఖీ చేసినట్లు ఔషధ తనిఖీ అధికారి ఎం.శ్యాంసుందర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డ్రగ్స్, కాస్మోటిక్ యాక్టివ్ 1940 నిబంధనలను మెడికల్ అసోసియేషన్, ఫార్మసిస్టులకు వివరించినట్లు తెలిపారు. నిబంధనలు పాటించని షాపులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని వినతి


కూచాడి శ్రీహరి రావుకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

లక్ష్మణచాంద, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అక్రమ కట్టడాలను ఆపివేయాలని స్థానిక ప్రత్యేక అధికారి అమీర్ ఖాన్‌కు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవటం లేదని లక్ష్మణచాంద గ్రామస్థులు డీసీసీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావును బుధవారం కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. సుమారు 50 సంవత్సరాల క్రితం మాదిగ మాల సామాజిక వర్గాల అభివృద్ధి కోసం నిర్మించిన దుకాణ సముదాయం, హరిజన వాడ పాఠశాల భవనాలను అనుమతులు లేకుండా కూల్చి వేయడమే కాకుండా ఆ కూల్చి వేసిన ప్రదేశంలో మాల సామాజిక వర్గం వారు అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలు నిలిపి వేయాలని మండల ప్రత్యేక అధికారి అయినటువంటి అమీర్ ఖాన్‌కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. అక్రమ కట్టడాలను చేపట్టడం వలన మాదిగ, మాల సామాజిక వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయని, శాంతి భద్రతలకు భంగం కలిగే అవకాశాలున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఒడ్నాల రాజేశ్వర్, లక్ష్మణచాంద గ్రామ మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, నారాయణ, మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్, నాగేష్, నర్సయ్య, లింగన్న, మహిపాల్, సాయన్న పాల్గొన్నారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేసిన డీసీసీ అధ్యక్షుడు

దిలావర్‌పూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాల్వ తాండ గ్రామానికి చెందిన ధరావత్ గోవింద్ అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 2.50 లక్షల ఎల్‌వోసీ చెక్కును బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు బుధవారం అందజేశారు.

సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం

నిర్మల్ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : భారత్‌ను దోచుకుంటున్న ఎమ్మెన్సీ, కార్పొరేట్లు భారత దేశాన్ని వదిలి వెళ్లాలని సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం ట్రంప్, మోదీ దిష్టిబొమ్మ దనం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంది రామయ్య, దుర్గం నూతన్, రాజు, రాజన్న, రమేష్, తిరుపతి, హరిత, రామ్‌లక్ష్మణ్, బక్కన్న, లక్ష్మీ, గంగన్న, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

తానూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బేల్‌తరోడా గ్రామ ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం వాహనండీకొని బన్సోడే ప్రభుధాస్(35) మృతిచెందినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. వివరాల ప్రకారం... మహాలింగి గ్రామానికి చెందిన ప్రభుదాస్ భార్య, కుమారుడితో కలిసి భైంసా నుంచి ఇంటికి వెళ్తుండగా బేల్‌తరోడా గ్రామం వద్ద రోడ్డు దాటే క్రమంలో ఐచర్ వాహనం ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌ను పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై అక్కడి చేరుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైనికుల త్యాగాలు మరువలేనివి

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్


సైనికులతో ముథోల్ ఎమ్మెల్యే పాటిల్

భైంసా, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులోని సైనికుల త్యాగనిరతితోనే మనమంతా సురక్షితంగా ఉండగలుగుతున్నామని, రక్షణ చర్యల్లో వారి సేవలు అనిర్వచనీయమైనవని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో పలువురు పదవీ విరమణ పొందిన సైనికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన పదవీ విరమణ పొందిన సైనికులను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ఘనంలగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. ఇందులో బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు రావుల రాము, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ లింగురామ్, పార్టీ ప్రతినిధులు కాసర్ల ప్రవీణ్ కుమార్, న్యామత్‌కర్ లింగోజీ, సుభాష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్తు

భైంసా రూరల్ : చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మె ల్యే రామారావు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో 95 మంది విద్యార్థులకు బీజేపీ నాయకులు పండిత్ రావు పటేల్ స్కూల్ షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి సుభాష్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు


సీసీ కెమెరాలతో మున్నూరు కాపు సంఘం నాయకులు

ముథోల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో గల తానూర్ బైపాస్ రోడ్డు పక్కన గల హనుమాన్ మందిరం వద్ద బొగడ వాడకట్టు మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో 4 సీసీ కెమెరాలను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముథోల్ నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు రోళ్ల రమేష్ మాట్లాడుతూ... గత కొన్ని నెలల నుంచి ముథోల్‌లో చాలా దొంగతనాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రోళ్ల బాలాజీ, టి. ధర్మన్న, హంగిర్గా లక్ష్మణ్, సంఘం మెంబర్లు వెంకటాపురం పోతన్న, హంగిర్గా భోజన్న, భూమన్న, పోతన్న పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి..

సోన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సోన్ సీఐ గోవర్ధన్, ఎస్సై గోపి తెలిపారు. బుధవారం పాక్‌పట్ల గ్రామంలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో వీడీసీ సభ్యులు, యువకులు, పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ముథోల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించాల గ్రామంలో పెక్కంటి లక్ష్మీ అనే మహిళా సంఘం సభ్యురాలు ఇటీవల చనిపోయింది. అయితే వారికి పీఎం జేజేబీవై పథకం కింద రూ. 2 లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీజీబీ ఎడ్‌బిడ్ మేనేజర్ నవీన్, ఏపీఎం గురుచరణ్, ఏఎం సంగీత, సీసీ పోశెట్టి, వీవోఏ లత, గ్రామ సంఘం సభ్యులు, తదితరులున్నారు.

ముధ్గల్‌లో ప్రకృతి విపత్తులపై అవగాహన

ముథోల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముధ్గల్ గ్రామంలో బుధవారం జాతీయ విపత్తు ప్రతి స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) ప్రకృతి వైపరీత్యాలు, ఇతర విపత్తుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదవశాత్తు నీళ్లల్లో పడి కొట్టుకపోతే ఎలా కాపాడాలి. అగ్ని ప్రమాదం జరిగితే ఎలా స్పందించాలి. పాము కాటుకు గురైతే ఏం చేయాలి. తదితర విపత్తుల గురించి బయటపడేందుకు ప్రజలకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు.

ముగిసిన రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ

భైంసా, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే రైతుబీమా పథకానికి సంబంధించి అర్హులైన రైతుల దరఖాస్తుల స్వీకరణ బుధవారం ముగిసింది. మూడు రోజులు గడువుతో సోమవారం ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్‌లో వాటి నమోదు ప్రక్రియ బుధవారం ముగిసింది. సాంకేతిక సమస్యలతో సోమవారం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు అంతంత మాత్రంగానే జరిగింది. మంగళవారం సాంకేతిక సమస్యలు తొలగిన నేపథ్యంలో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ సజావుగా కొనసాగింది. వ్యవసాయశాఖ కార్యాలయాలతో పాటు వ్యవసాయ విస్తరణ అధికారుల కార్యాలయాలు దరఖాస్తుదారులతో సందడిగా కనిపించాయి.

స్థలం వదిలి గోడ నిర్మించాలి

ఖానాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండ్‌ను ఆనుకొని నిర్మిస్తున్న ప్రహరీ బస్టాండ్ ఇన్ గేట్ వద్ద 20 ఫీట్ల స్థలాన్ని వదిలి నిర్మించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం బస్టాండ్ ఇన్ గేట్ స్థలాన్ని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్, సీపీఐఎం, సీపీఐ వామపక్షాల ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఏళ్ల తరబడిగా ఇన్ గేట్ ద్వారా చుట్టుపక్క గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారని ప్రస్తుతం ఆర్టీసీ అధికారులు గోడతో ఇన్ గేట్‌ను మూసి వేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ఇన్ గేట్ కోసం 20 ఫీట్ల స్థలాన్ని వదిలి వేసి గోడ నిర్మాణం చేయాలని లేని పక్షంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నంది రామయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, ఖానాపూర్ పట్టణ నాయకులు సతీష్ రావు దేశ్‌పాండే, గంగారాములు, తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా భావించాలి

ఖానాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భోనగిరి నరేందర్ రావు అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో పర్యావరణ సమతుల్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తమ తల్లితో కలిసి మొక్కలు నాటి 15 మంది విద్యార్థుల వివరాలను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని పోర్టల్ నమోదు చేశారు. అనంతరం ఫొటోతో కూడిన ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలను విద్యార్థులకు అందజేశారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి ఆ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తొంటిశంకర్, కుర్ర శేఖర్, జాడి శ్రీనివాస్, వెన్నం అంజయ్య పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యఅతిథిగా సిరిసిల్ల రాజయ్య

నిర్మల్ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15వ తేదీన నిర్మల్ జిల్లాలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో నిర్వహించే వేడుకల్లో జాతీయ జెండాను తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్‌పర్సన్ సిరిసిల్ల రాజయ్య ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చాయి.

నర్సాపూర్ ఎంఈవోను సస్పెండ్ చేయాలి

- టీజీవీపీ డిమాండ్


మాట్లాడుతున్న టీజీవీపీ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ

నర్సాపూర్(జి), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, ముఖ్యంగా ఎలాంటి అనుమతులు లేని కేరళ స్కూల్ పట్ల టీజీవీపీ (తెలంగాణ విద్యార్థి పరిషత్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. టీజీవీపీ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కొట్టూరి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... ఎంఈవో కేవలం కమిషన్ల కోసం నిబంధనలను ఉల్లంఘిస్తూ అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఎంఈవోను సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గణేష్, సాయిరామ్, తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి

తలమడుగు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి వృద్ధుల పట్ల సేవభావం కలిగి ఉండాలని సాయిలింగి వ్యవస్థాపక అధ్యక్షులు దెబ్బడ అశోక్ కోరారు. బుధవారం మండలంలోని సాయి డెంగ్యూ వృద్ధాశ్రమంలో అదిలాబాద్ పట్టణంలోని మణిపూర్ కాలనీకి చెందిన కొంకటి సృజన శ్రావణ్ కుమార్, కూతురు కొంకటి ఇతిక్ష, ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తన పుట్టిన రోజు వేడుకలను సాయి లింగి గ్రామంలోని సాయి వృద్ధాశ్రమంలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు తెలిపారు. వరుసగా ఇది నాల్గవ సంవత్సరం అని వారు తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు కూడా సామాజిక సేవ భావంతో వృద్ధాశ్రమాల్లో పుట్టినరోజు వేడుకలు ఇతర శుభకార్యాలు కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థాలు కార్యక్రమాలు జరుపుకోవాలని సూచించారు. అనంతరం వృద్ధులకు అన్నదానం, పండ్ల పంపిణీ చేపట్టారు.

గొడవలో గాయపడిన యువకుడి మృతి

సారంగాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఎనుగంటి సుధాకర్(34) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కౌట్ల(బి) గ్రామానికి చెందిన వ్యక్తితో సుధాకర్‌కు 15 రోజుల క్రితం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో సదరు వ్యక్తితో పాటు ఆయన స్నేహితులు సుధాకర్‌పై దాడి చేశారని తెలిసింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని నిర్మల్, అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు. ఆయన పరిస్థితి విషమించడంతో మంగళవారం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కజ్జర్లలో ఖోడద్ గ్రామస్తుల అన్నదానం

తలమడుగు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కజర్ల గ్రామంలో నిర్వహిస్తున్న శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఖోడద్ గ్రామస్తులు, శబరిమాత భక్తులు కజర్ల గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖోడద్ మాజీ సర్పంచ్ సాకే ఆనంద్ మాట్లాడుతూ శ్రావణమాసంలో గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. అదేవిధంగా నెలరోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో శబరిమత అఖండ జ్యోతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించినందుకు గ్రామస్తులకు శబరిమాత భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇందులో శబరిమాత భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నవ్య
కుటుంబ కదంబం
గురువారం
14 ఆగస్టు 2025





"విదేశీయుల పాలన నుంచి భారతదేశ విముక్తి లక్ష్యంగా సాగిన పోరాటాలు, ఉద్యమాలు, మహనీయుల త్యాగాల ఫలితం ఈనాడు మనమంతా అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు. తెలుగు నేల మీద సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం కలగలిసి... మానవీయ విలువలకు పట్టంకట్టిన అద్భుతమైన కాలం అది. ఆ మహత్తర ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షులు మాత్రమే కాదు, అందులో భాగస్వాములు... గుత్తా జవహరీబాయి, రావూరి మనోరమ, ఏటుకూరి కృష్ణమూర్తి. 'స్వరాజ్యం మా జన్మహక్కు..' అని నినదించి జైలుకు వెళ్లిన, ఆ ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నవ్య' పలకరించింది.

ఆ త్యాగాలకు ఏదీ విలువ?

రహస్యంగా పత్రికలు బట్వాడా చేశా...

- ఏటుకూరి కృష్ణమూర్తి, 104 ఏళ్లు

"సామాజిక మార్పును కోరే కమ్యూనిస్టులే కలసి పని చేయలేకపోతున్నారు. ఇక సామాన్యులు ఐకమత్యంతో ఉండాలని కోరుకోవడం అత్యాశ అవుతుందేమో. గుంటూరు టౌన్ హైస్కూల్లో ఎస్‌ఎల్‌సీ చదువుతున్న రోజుల్లో 'క్విట్ ఇండియా' ఉద్యమానికి మద్దతుగా మేము నిరసన సభ నిర్వహించాం. కొందరు స్నేహితులం కలసి లాలాపేట పోలీస్ స్టేషన్‌మీద జాతీయ జెండా ఎగరేశాం. దాంతో పోలీసులు మమ్మల్ని అరెస్టు చేసి గుంటూరు సబ్ జైలులో నిర్బంధించారు. మాకు సంఘీభావంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పరామర్శకు వస్తుండడంతో... మమ్మల్ని బాపట్ల, మంగళగిరి... అలా రకరకాల ప్రదేశాలు తిప్పారు. మేము నాలుగు నెలలకు పైగా జైలు జీవితం గడిపాం. దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి మనుమలు నాకు మంచి స్నేహితులు. వారి ఇంటికి తరచుగా వెళ్లేవాణ్ణి. మరోవైపు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు లాంటి నాయకులను కలిసేవాణ్ణి.



ఆర్మీలో తిరుగుబాటు...

మా బాబాయి ఏటుకూరి జోగిరాజు సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేనూ జాతీయోద్యమంలోకి వెళ్లాను. విజయవాడ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ 'స్వతంత్ర భారత్' పత్రిక ప్రచురించేది. ఆ పత్రికను గుంటూరులోని జాతీయోద్యమ నాయకులకు పంచే బాధ్యత నాది. అలా రహస్యంగా చాలాకాలం ఆ పత్రికల్ని బట్వాడా చేశాను. కొన్నాళ్లకు 'బ్రిటిష్ - ఇండియా ఆర్మీ'లో చేరాను. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా రాయల్ ఇండియన్ నేవీ సైనికులు తిరుగుబాటు ప్రారంభించారు. వారికి మద్దతుగా నేనూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మమ్మల్ని అరెస్టు చేసి, లాహోర్ జైల్‌లో కొన్నాళ్లు నిర్బంధించారు. దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత మమ్మల్ని విడుదల చేశారు. ఆ వెంటనే ఆంధ్రా రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో చేరాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు నావంతుగా సహకారం అందించాను. ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాను. రోజూ దినపత్రికలే నా కాలక్షేపం."

అమ్మతో కలసి జైలుకెళ్లాను

- రావూరి మనోరమ, స్వాతంత్ర్య సమరయోధురాలు, 98 ఏళ్లు

"సొంత గొడవే కానీ స్వాతంత్ర్యోద్యమ విలువలు ఈనాడు పట్టినదెవరికి? ఆనాడు అంతా ఒక్కటై దేశంకోసం పోరాడాం. ఈనాడు ఎవరికి వారు గొప్పగా బతకాలని ప్రతిఒక్కరూ ఆరాటపడుతున్నారు. వ్యక్తిగత స్వార్థం పెరిగింది. మనం ఇవాళ అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు తమకు పుట్టుకతోనే వచ్చినవేనన్నది ఈ తరం అభిప్రాయం. అవి ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించాయన్న కనీస స్పృహ, ఆలోచన నేటి యువతీ, యువకుల్లో లేకపోవడం బాధాకరం. ఉద్యోగరీత్యా ఎన్నో మంచి అవకాశాలను సునాయాసంగా వదిలి జాతీయోద్యమానికి అంకితమయ్యారు మా నాన్న గోపరాజు రామచంద్రరావు (గోరా). సమాంతరంగా ఆంధ్ర దేశంలో కుల నిర్మూలనోద్యమానికి నాయకత్వం వహించారు. నాస్తికోద్యమంలో ఆయనకు శిష్యుడైన రావూరి అర్జునరావుతో నాకు వివాహం జరిపించి గొప్ప ఆదర్శవాదిగా నిలిచారు. ఇప్పుడు ఆ నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీ సమాజంలో పెద్దగా కనిపించడం లేదు.

క్విట్ ఇండియా పోరాటం...

ఒక్క స్వాతంత్ర్య పోరాటమే కాదు, సామాజిక మార్పు కోసం మా నాన్న తలపెట్టిన ప్రతి సంఘ సంస్కరణ ఉద్యమంలో అమ్మ సరస్వతీ గోరాతో పాటు మేమంతా పాల్గొన్నాం. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో విజయవాడలోని ఒకచోట అమ్మ, మా మేనత్త సామ్రాజ్యంతో పాటు నేను, మరి కొంతమంది మహిళలం సమావేశమయ్యాం. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీకి అలా కదిలామో లేదో... మమ్మల్ని పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ సబ్ జైలులో కొన్ని రోజులు నిర్బంధించిన తర్వాత... మమ్మల్ని రాయవెల్లూరు జైలుకు తరలించారు. కారాగారం అనే మాటే గానీ... ఆట, పాటలతో చాలా సందడిగా ఉండేది. ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో మెలిగేవాళ్లు. జైలర్లు కూడా మమ్మల్ని చాలా గౌరవంగా చూసేవారు. ఆ ఆరునెలల జైలు జీవితం మరచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

మహాత్ముడు నిర్ణయించిన ముహూర్తం...

అర్జునరావుతో నాకు వివాహం నిశ్చయించిన తర్వాత ఆ విషయాన్ని గాంధీగారికి మా నాన్న చెప్పారు. బులుసు సాంబమూర్తి గారి ద్వారా నా ఇష్టాయిష్టాలను తెలుసుకున్న తర్వాత... సేవాగ్రామ్‌లో తన చేతుల మీదుగా మా పెళ్లి జరిపిస్తానని మహాత్మా గాంధీ మాట ఇచ్చారు. అయితే... రెండేళ్లు ఆగమన్నారు. నాకు తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా ఆశ్రమంలో జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. అర్జున్‌రావును తన వెంట వార్ధాకు తీసుకువెళ్లారు. ఏడాది తర్వాత ఒక రోజు... 1948, మార్చి 13న మా వివాహానికి మహాత్మాగాంధీ ముహూర్తం ప్రకటించారు. అంతా సవ్యంగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో... ఆ ఏడాది జనవరి 30న గాంధీ హత్యకు గురయ్యారు. బాపూజీ లేకపోయినా, ఆయన నిర్ణయించిన ముహూర్తానికి సేవాగ్రామ్‌లోని కస్తూర్బా కుటీరం దగ్గర ఆనాటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ లాంటి మహనీయుల సమక్షంలో... అర్జునరావు, నేను నూలుదండలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాం. అతిథులకు వేపిన వేరుశెనగపప్పు, బెల్లం పంచారు.

లోక్‌నాయక్ పరామర్శ...

వివాహానంతరం కృష్ణాజిల్లా వానపాములలో కొన్నాళ్లు ఉన్నాం. ఆ సమయంలో నా యోగక్షేమాలు తెలుసుకోవడంకోసం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణగారు ఆ ఊరు వచ్చారు. గ్రామంలోని దళితవాడలో మేము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు చూసి మెచ్చుకొన్నారు. తర్వాత 1960 నుంచి నలభై ఏళ్లకు పైగా గుడివాడలో 'అంబేద్కర్ హరిజన బాలికా వసతి గృహం' నడిపాం. వారందరికీ నేనే స్వయంగా వండి వడ్డిస్తే, అమ్మాయిల చదువు బాధ్యతను అర్జునరావు చూసుకున్నారు. అలా ఎంతో మంది నిరుపేద అమ్మాయిలకు తల్లిదండ్రులుగా మారి, చేతనైన సాయం అందించడానికి ప్రయత్నించాం. ఒంట్లో ఓపికున్నంత కాలం పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని, నాస్తికవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాం. ఇప్పుడు మా పిల్లలు మిలాప్, చునావ్, సాదిక్, పవర్, అమ్మాయి నూయజ్ కలసి 'మార్పు' ట్రస్ట్ ద్వారా కొన్నిసామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదు

- గుత్తా జవహారి బాయి, 102 ఏళ్లు

"పెద్ద వయసు వల్ల కాలు బయట పెట్టలేకపోయినా, బయట ఏం జరుగుతోందో నాకు తెలుసు. టెలివిజన్‌లో ముఖ్యమైన వార్తలు ప్రతిరోజూ తప్పనిసరిగా చూస్తాను. నేటి రాజకీయాలు బాగోలేవు. అంతా స్వార్థం, అవినీతి, నిలకడలేనితనం. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అయినా... ఈ దేశంలో ఇంకా కూడు, గూడులేనివారు ఎంతోమంది ఉన్నారంటే, సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదనే కదా అర్థం! ఏమయ్యాయి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ఆశలు, ఆకాంక్షలు? జాతీయోద్యమంలో మా కుటుంబం మొత్తం పాల్గొని జైలుకు వెళ్లింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కారణంగా నా భర్త గుత్తా సుబ్రహ్మణ్యం సోదరులు రామానుజయ్య, రాఘవయ్య, చలమయ్య, మా ఆడపడుచు రాజారత్నం, నా పెద్ద తోటి కోడలు సుందరమ్మ... వీరంతా జైలు శిక్ష అనుభవించారు. సుందరమ్మ అయితే విష జ్వరంతో బాధపడుతూ రాయవెల్లూరు జైలులోనే మరణించింది. 'బ్రిటిష్ ప్రభుత్వం నశించాలి', 'స్వాతంత్ర్యం కావాలి' అని రోడ్డుమీద నినాదాలు చేసినందుకు నన్నూ అరెస్టు చేసి, కొద్దిరోజులు జైల్లో ఉంచారు.

నేతాజీకి మా నాన్న స్నేహితుడు

నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు మా నాన్న గుంటూరు సుబ్బారావు మంచి స్నేహితుడు. కోల్‌కతా ఒరియంటల్ కాలేజీలో వారిద్దరికీ పరిచయం. వారిమధ్య చాలాకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. నేతాజీ స్ఫూర్తితో మా నాన్న కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. నాన్నకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సత్సంబంధాలున్నాయని తెలిసి పోలీసులు చాలారోజులు ఆయనను వెంటాడారు. అటు నా పుట్టింటివారు, ఇటు మెట్టినింటి వారు స్వాతంత్ర్యోద్యమంతో పాటు సంఘ సంస్కరణోద్యమంలోనూ భాగమయ్యారు. ఇప్పుడు ఆ విలువలను కొనసాగించడానికి యువత ముందుకు రావాలి. మహనీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి."

• **సాంత్వన్,** ఫొటోలు: హరిప్రేమ్



పాదయాత్రలో పాల్గొన్న జగన్మోహన్‌రెడ్డి, భక్తులు(ఫైల్)

సమాజంలో భక్తిభావం పెంపొందించేందుకే

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

- యేటా శ్రావణంలో కాలి నడకన కదిలికి..
- సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 18న యాత్రకు ఏర్పాట్లు
- వందలాదిగా తరలిరానున్న భక్తులు

నిర్మల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సమాజంలో భక్తిభావాన్ని పెంపొందించేందుకు సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఏడాది పొడవునా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతూ భక్తులందరినీ ఏకం చేస్తున్న సాయి దీక్ష సేవా సమితి సేవలను ప్రతి ఒక్కరూ కొనియాడుతున్నారు. నిర్మల్ పట్టణంలోని గండి రామన్న క్షేత్రంలో సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి సోదరులు తమ సొంత ఖర్చులతో ఇప్పటికే అనేక ఆలయాలను నిర్మించి దివ్య క్షేత్రంగా మార్చిన సంగతి తెలిసిందే. గత పదేళ్లగా షిరిడీ నుంచి సాయి పాదుకలను తెప్పించి మహాసాయి పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. అలాగే ఏటా శ్రావణ మాసంలో నిర్మల్ నుంచి కదలి పాపహరేశ్వర ఆలయం వరకు నిర్వహించే మహా పాదయాత్రకు సైతం భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ క్రమంలోనే ఈనెల 18న ఉదయం జిల్లా కేంద్రంలోని నటరాజ్ నగర్‌లో గల శివాలయం నుంచి దిలావర్‌పూర్ మండలంలోని కదిలి పాపహరేశ్వర ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించేందుకు సాయి దీక్ష సేవా సమితి అన్ని ఏర్పాట్లు చేసింది. దాదాపు 25 కి.మీ. పాటు సాగనుంది.

- **లోక కల్యాణం కోసమే : లక్కడి జగన్మోహన్ రెడ్డి, సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు, నిర్మల్**

పవిత్ర శ్రావణ మాసంలో లోక కల్యాణం కోసమే ఈ పాదయాత్రను నిర్వహిస్తున్నాం. గత 9ఏళ్లుగా కార్యక్రమం నిర్విఘ్నంగా సాగుతోంది. ఈ పాదయాత్రలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొంటారు. రోజురోజుకూ పెరిగిపోతున్న ఆధునికతకు యువత బానిసలుగా మారుతున్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా యువతలో ఆధ్యాత్మిక భావన పెరుగుతుంది.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

సిరికొండ రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తుకారాం అన్నారు. బుధవారం తహసీల్దార్ తుకారాం, ఎస్సై సట్లపల్లి పూజతో కలిసి పలు గ్రామాలతో పాటు, గ్రామాల సమీపంలోని వాగుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజలను అప్రమత్తం చేశారు. తహసీల్దార్ తుకారాం మాట్లాడుతూ అత్యవసరం ఉంటే తప్ప బయటికి రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని వారు ఈ సందర్భంగా కోరారు.

ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం

- అత్యధికంగా ఉట్నూర్‌లో 77.1 మి.మీల వర్షపాతం
- సాత్నాల ప్రాజెక్టు గేటును ఎత్తి నీటిని వదులుతున్న అధికారులు
- వరదనీటితో పరవళ్లు తొక్కుతున్న కుంటాల, పొచ్చెర, పలు జలపాతాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షం



సిరికొండలో ఉప్పొంగిన చిక్‌మన్ వాగు



లక్షెటిపేట వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ఆదిలాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గత రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా ఓ మోస్తారు స్థాయిలో వర్షం కురిసింది. జిల్లా సాధారణ వర్షపాతం 8.3 మి.మీ.లు కాగా అధికంగా 42.8 మి.మీల వర్షపాతం నమోదైంది. ఉట్నూర్ మండలంలో అత్యధికంగా 77.1 మి.మీలు ఇచ్చోడ మండలంలో 74.2, సిరికొండలో 69.5, బజార్‌హత్నూర్‌లో 63.9, సోనాలలో 62.3, బోథ్‌లో 58.2 మి.మీల వర్షపాతం నమోదైంది.అత్యల్పంగా భీంపూర్ మండలంలో 10.6 మి.మీ.ల వర్షం కురిసింది. మూడు రోజుల పాటు జిల్లాకుభారీ వర్ష సూచన ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. భారీ వర్షాల నేపత్యంలో ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. సాత్నాల ప్రాజెక్టు ఒక గేటును ఎత్తి దిగువకు వరద నీటిని వదులుతున్నారు. తర్నంలో లెవల్ బ్రిడ్జి పై నుంచి వరదనీరు ప్రవహించడంతో జైనథ్, బేల మండలాలకు వెళ్లే రాకపోకలను పూర్తిగా నిలిపి వేశారు. ఆదిలాబాద్ పట్టణం నుంచి నిరాల మీదుగా దారి మళ్లించారు.ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు పెన్‌గంగా నది ఉధృతంగా ప్రవహిస్తుంది. వరద నీటితో కుంటాల, పొచ్చెర, గాయత్రి, కనకాయి జలపాతాలు పరవళ్లు పెడుతున్నాయి. ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉండడంతో మూడు రోజుల పాటు జలపాతాలను సందర్శించేందుకు పర్యాటకులకు అనుమతులు నిలిపి వేశారు. జిల్లాలో ఏకతాటిగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు నిండుకుంటున్నాయి. కురుస్తున్న వర్షాలు పంటలకు మేలు చేసే విధంగా ఉన్నాయంటూ రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఉట్నూర్: గత మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తుండడంతో ఉట్నూర్ మండలంలోని పలు వాగులు పొంగి ప్రవహించడంతో మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉట్నూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఉట్నూర్ మండలంలో 73.2 మి.మీ., ఇంద్రవెల్లి మండలంలో 61.2, నార్నూర్ మండలంలో 58, గాదిగూడ మండలంలో 38 మి.మీల వర్షపాతం నమోదు అయింది. ఫలితంగా ఉట్నూర్ మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు వాగులు అడ్డంకిగి మారాయి. నర్సాపూర్(జె), జండగూడ, వంకతుమ్మ, లక్షెటిపేట, మత్తడిగూడ ప్రాంతాలలో ఉన్న వాగులు పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామీణ ప్రాంతాల ప్రజలు బయటకు రాలేక పోయారు. వర్షాల కారణంగా ఎలాంటి నష్టం జరగలేదని రెవెన్యూ అధికారులు తెలిపారు. షాంపూర్ లక్షెటిపేట మధ్య ఉన్న లక్షెటిపేట వాగు వంతెన పై నుంచి నీళ్ల పారుతుండడంతో అటువైపు పాఠశాలలకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.

ఇచ్చోడ: అర్ధరాత్రి నుంచి ఆగకుండా కురిసిన వర్షానికి ఇచ్చోడలోని రహదారులంతా నీటితో నిండుకున్నాయి. దీంతో పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లే రహదారులలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గంటల తరబడి వెచిఉండాల్సి వచ్చింది. ఇటీవల నిర్మించిన రెండువరుసల రహదారి ఎత్తు పెరగడంతో కాలనీలన్నీ జలమయమయ్యాయి. మురుగుకాలువలు లేకపోవడంతో వరదనీరు ముందుకు సాగక కాలనీలో, దారులపై, ఇళ్లలోకి వర్షంనీరు చేరింది.

తలమడుగు: రాష్ట్రంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో అదిలాబాద్ జిల్లా మండలంలో బుధవారం తెల్లవారు జాము నుంచి కురిసిన వర్షంతో వాగుల వంకల ప్రాంతంలో గల పత్తి పంటలు నీరు రావడంతో పత్తి పంట నీట మునిగిపోయింది. అదేవిధంగా జోరుగా కురుస్తున్న వర్షంతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ వర్షపు నీరు నిలువ నిలవడంతో పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పలేదు. రాత్రి నుంచి కురిసిన వర్షం మధ్యాహ్నం రెండు గంటల వరకు తగ్గుముఖం పట్టడంతో జనం బయటకు వచ్చారు. అదేవిధంగా భారీ వర్షాలతో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా మండల వాసులకు, రెవెన్యూ అధికారులు ఇతర శాఖ అధికారులు ముందస్తుగా అవగాహన కల్పించి అప్రమత్తం చేశారు.



బోరజ్ వద్ద రాకపోకలను నిలిపివేసిన పోలీసులు

తర్నం లోలెవల్ బ్రిడ్జిపై ఉప్పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

జైనథ్ రూరల్: జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్, సాత్నాల, జైనథ్ మండలాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాలలో గల నదులు, కాల్వలు, చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. సాత్నాల మండలంలో గల సాత్నాల ప్రాజెక్టు గేట్‌లు మరియు తాంసి మండలంలోని వడ్డాడి ప్రాజెక్టు గేట్లను ఎత్తి వేయడం బుధవారం మండలంలోని తర్నం వద్ద సాత్నాల నది ఉప్పొంగి ప్రవహిస్తుంది.తర్నం లోలెవల్ బ్రిడ్జి పై నుంచి వరద నీరు ప్రవహించడంతో జైనథ్ మండల ఎస్సై గౌతం ఆధ్వర్యంలో బోరజ్ జాతీయ రహదారిని తర్నం వైపు వాహనాలు వెళ్లకుండా బార్ గేట్‌లతో మూసివేశారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. వివిధ గ్రామాల నుంచి ప్రజలు ప్రయాణికులు జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్‌కు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ప్రాజెక్టు పరిశీలనకు వెళ్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్

సాత్నాల ప్రాజెక్టును సందర్శించిన ఆదిలాబాద్ కలెక్టర్, ఎస్పీ

జైనథ్ రూరల్: జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల పరిధిలో గల మధ్యతరహా ప్రాజెక్టు అయిన సాత్నాల ప్రాజెక్టును బుధవారం ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు చిత్రపటాన్ని ప్రాజెక్టు ఈఈ విఠల్‌రావ్ రాథోడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా సాత్నాల ప్రాజెక్టు నాలుగు గేట్లలో ఒక్క గేట్ ద్వారా దిగువకు వరద తరలుతున్న వరద నీటి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ , ఎస్పీలు మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాజెక్టు కార్యాలయాన్ని గేట్‌లను పరిశీలించారు. ప్రాజెక్టుపైకి ఎవ్వరూ వెళ్లకుండా పోలీసులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా సాత్నాల ప్రాజెక్టు ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్, ఏఈ దీపక్, సాత్నాల మండల తహసీల్దార్ జాదవ్‌రామారావ్,ఎంపీడీఓ వెంకట్‌రాజ్,ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ సాయినాథ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో గురువారం అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. మంజులాపూర్‌లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చుటకు గాను ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహేంద్రషోరూమ్, సిరి బ్యాంకెట్‌హాల్, వినాయక్‌నగర్, శివాజీనగర్, మస్తా దుబ్బ, సాగర్‌కాలనీ, గవర్నమెంట్ స్కూల్, ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● అడిషనల్ డీఆర్డీవో చరణ్‌దాస్


మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీవో

దిలావర్‌పూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నదే ఇందిరాక్రాంతి పథం ఉద్దేశమని అడిషనల్ డీఆర్డీవో చరణ్‌దాస్ అన్నారు. బుధవారం శ్రీ శక్తి భవనంలో జరిగిన సామాజిక చేకూర్పు, నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, విభిన్న ప్రతిభావంతుల సం ఘాలు, వయోవృద్ధుల సంఘాలు, కిషోర బాలికల సంఘాల ఏర్పాటుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలు సంఘటితంగా ఉంటూ ప్రభుత్వ సహాయాన్ని అందిపుచ్చుకుని స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని, మీరు ఎదగడంతో పాటు మరో పదిమందికి ఉపాధి కల్పించాలని సూచించారు. మండలంలో మరిన్ని స్వయం సహాయక సంఘాలతో పాటు వయోవృద్ధుల సంఘాలు, కిషోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా దివ్యాంగుల సంఘాలను ఏర్పాటు చేసి సంఘాల్లో ఉన్న దివ్యాంగులను పెళ్లి చేసుకున్న వారికి రూ.లక్ష మ్యారేజ్ గిఫ్ట్ కింద ఇవ్వనున్నట్లు చెప్పారు. 60 సంవత్సరాలు నిండిన మహిళలను వృద్ధ సంఘాల్లో చేర్చాలని సూచించారు. 18 నుంచి 60 సంవత్సరాలలోపు మహిళలకు లోన్‌బీమా, ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో డీపీఎం గంగన్న, ఏపీఎం బోసు, మండల సమాఖ్య అధ్యక్షురాలు సునీత, కోశాధికారి సంయుక్త, సీసీలు సాయన్న, పోశెట్టి, ముత్యం, అకౌంటెంట్ శ్రీనివాస్, వీవోఈసీ సభ్యులు, స్టాఫ్ వీవోఏలు పాల్గొన్నారు.

విస్తరిస్తున్న.. మత్తు ప్రపంచం

● రోజురోజుకూ పెరుగుతున్న గంజాయి, కల్తీ కల్లు వ్యసనపరులు
● జిల్లా ఆసుపత్రిలోని డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్సలు
● మిత్రులు, తల్లిదండ్రులు సహకరించాలంటున్న డాక్టర్లు


డీ అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్ (ఫైల్)

నిర్మల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా మత్తు ప్రపంచం చాప కింద నీరులా అతివేగంగా విస్తరిస్తోంది. కల్తీ కల్లు, గంజాయి లాంటి మత్తు పదార్థాలు రహస్య ప్రదేశాల్లో విక్రయిస్తుండడం వ్యసనపరులకు వరంగా మారుతోంది. కాగా కల్తీ కల్లు, గంజాయిలకు బానిసలుగా మారి మానసికంగా కుంగిపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. కొంత కాలం నుంచి జిల్లా అంతటా విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలతో పాటు ఆ గంజాయికి బానిసలుగా మారుతున్న వారి సంఖ్య విస్తరిస్తోంది. ముఖ్యంగా యూత్ గంజాయికి బానిసలుగా మారి వ్యసనపరులుగా మారుతున్నారు. పోలీసులు గంజా గస్తీ పేరిట విస్తృత తనిఖీలతో పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ దీనిని నివారించడం మాత్రం పూర్తిస్థాయిలో సాధ్యం కావడం లేదు. గంజాయికి తోడుగా కల్తీ కల్లు అమ్మకాలు కూడా విచ్చలవిడిగా సాగుతుండడంతో వీటికి బానిసలుగా మారుతున్న పిల్లల తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. గంజాయి, కల్తీ కల్లుకు బానిసలుగా మారిన యువకులు మానసిక రోగులుగా మారి వారి కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నారు. జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ హాస్పిటల్‌లో గల డీ అడిక్షన్ సెంటర్‌కు గత ఏడాది కాలం నుంచి కల్తీ కల్లు, గంజాయికి బానిసలుగా మారిన వారు పెద్ద సంఖ్యలో కౌన్సెలింగ్‌తో పాటు వైద్య చికిత్సల కోసం వస్తుండడం ఇక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

డీ అడిక్షన్ సెంటర్‌కు పెరుగుతున్న మత్తు బాధితులు

జిల్లా కేంద్రంలోని డీ అడిక్షన్ సెంటర్‌కు ప్రతీ నెల దాదాపు 100 మంది వరకు కల్తీ కల్లు, గంజాయికి బానిసలైన వారు కౌన్సెలింగ్‌తో పాటు చికిత్సల కోసం వస్తున్నారు. అలాగే గత ఏడాది కాలం నుంచి ఇప్పటి వరకు దాదాపు 160 మందికి పైగా ఇన్ పేషెంట్లుగా ఇక్కడ చికిత్సలు పొందడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. గంజాయి, కల్లుకు బానిసలుగా మారి విచిత్ర చేష్టలతో పాటు సైకోలుగా వ్యవహరిస్తున్న వారిని వారి మిత్రులు, కుటుంబ సభ్యులు ఇక్కడి డీ అడిక్షన్ సెంటర్‌కు తీసుకువస్తున్నారు. అలాగే గంజాయి, కల్తీ కల్లుకు వ్యసనపరులుగా మారిన వారు అకస్మాత్తుగా వీటి వినియోగాన్ని ఆపివేస్తే వారు విచిత్రంగా ప్రవర్తిస్తారని ఇక్కడి వైద్యులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వీటికి వ్యసనపరులుగా మారిన వారు నిద్ర, విశ్రాంతి లేకుండా అస్థిరత్వంతో వ్యవహరిస్తారని, కాళ్లు, చేతులు వనకడం, ఫిట్స్ లాంటివి రావడం, అకస్మాత్తుగా పడిపోవడం లాంటి దుష్పరిణామాలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా గంజాయి, కల్లుకు బానిసలైన యువకులు అవి లేకుండా ఉండలేకపోతున్నారని అయితే కొంతమంది కూలీ పనులు చేసే వారు మాత్రం ఆ పనులలో నిమగ్నం అవుతుండడంతో వారికి వీటి ప్రభావం పెద్దగా ఉండడం లేదని వైద్యులు పేర్కొంటున్నారు.

అందుబాటులో సౌకర్యాలు

కాగా స్థానిక జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ సెంటర్‌లో ఇన్ పేషెంట్ల కోసం ప్రత్యేకంగా 6 బెడ్‌లను సమకూర్చారు. అలాగే వారికి అవసరమైన మందులను కూడా అందుబాటులో ఉంచారు. దీనికి తోడుగా ఓ కౌన్సిలర్‌తో పాటు స్టాఫ్‌నర్స్ కూడా డీ అడిక్షన్ సెంటర్‌లో వైద్య సేవలందిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ ట్రైనీ కౌన్సిలర్‌ను అలాగే ట్రైనీ స్టాఫ్ నర్స్‌ను నియమించాలన్న డిమాండ్ వస్తోంది. ఇక్కడ ట్రైనీ స్టాఫ్‌నర్స్, ట్రైనీ కౌన్సిలర్ లేకపోవడంతో ప్రస్తుతం డిప్యుటేషన్‌పై పని చేస్తున్న సిబ్బంది కొంత మేర ఇబ్బందులకు గురవుతున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా గంజాయి, కల్లుకు బానిసలైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం అలాగే వారు ఆ వ్యసనాలకు దూరమయ్యేట్లు చేయడం ఇక్కడి వైద్యాధికారికే కాకుండా సిబ్బందికి సైతం కత్తి మీద సాములా మారుతోందంటున్నారు.

డీ అడిక్షన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● అరుణ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సైకియాట్రీ డిపార్ట్‌మెంట్, నిర్మల్

జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ సెంటర్‌ను మత్తు బాధితులంతా సద్వినియోగం చేసుకోవాలి. గత కొద్ది రోజుల నుంచి డీ అడిక్షన్ కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా గంజాయి, కల్తీ కల్లుకు బానిసలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. యువకులు ఎక్కువగా బానిసలు అవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నిర్మల్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌లో కౌన్సెలింగ్‌తో పాటు వైద్య చికిత్సలు అందిస్తున్నాం. వ్యసనాలకు బానిసలైన వారిని వారి మిత్రులు లేదా తల్లిదండ్రులు గుర్తించి డీ అడిక్షన్ సెంటర్‌కు తీసుకురావాలి. అలాగే టోల్ ఫ్రీ నెంబర్ 1908కు కూడా సమాచారం అందించవచ్చు. గంజాయి, కల్తీ కల్లుకు బానిసలైన వారు అస్థిరంగా వ్యవహరించడం, వారి చదువు పూర్తిగా తగ్గిపోవడంతో పాటు చిరాకు, కోపం వంటి లక్షణాలు కనిపిస్తాయి. గంజాయి, కల్తీ కల్లు వ్యసనాలకు యువతను దూరంగా ఉంచేందు కోసం విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి వారి ప్రవర్తనను తల్లిదండ్రులు, మిత్రులు ఎప్పటికప్పుడు గమనించి డీ అడిక్షన్ సెంటర్‌ను సంప్రదించాలి.

ప్రత్యేక ఆధార్ క్యాంపునకు స్పందన

ముథోల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన ముథోల్‌లోని మండల అభివృద్ధి కార్యాలయంలోని సమావేశం మందిరంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపునకు స్పందన లభించింది. ఈ ఆధార్ క్యాంపు గురువారం సాయంత్రం వరకు కొనసాగనున్నట్లు సీడీపీవో సరోజిని తెలిపారు. ఉదయం నుంచే మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఆరుసంవత్సరాల లోపు పిల్లలను పోషకులు తీసుకొని ఆధార్ క్యాంపునకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఆధార్ కార్డు ఎంట్రీ, తప్పుల సవరణ తదితర వాటి గురించి వచ్చారు. దీంతో పాటు ఆరు సంవత్సరాల కన్నా ఎక్కువ వయస్సు ఉన్న వారు పెద్ద వారు సైతం క్యాంపునకు వచ్చి తిరిగి వెళ్లారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా, టీచర్లు, తదితరులు ఉన్నారు.

జామ, మామిడి తోటలు పరిశీలించిన అధికారి


పండ్ల తోటలను పరిశీలిస్తున్న అధికారి

సోన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిద్దిలకుంట గ్రామంలో ప్రభాకర్‌రెడ్డి వేసిన జామ, మామిడి తోటలను నిర్మల్ డివిజన్ ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి సాదుల మౌనిక పరిశీలించారు. రైతులందరూ పండ్ల తోటల రాయితీలను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ నుంచి మామిడి, జామ, నిమ్మ, సీతాఫలం పండ్ల తోటలకు 40 శాతం రాయితీ. అరటి, బొప్పాయి, డ్రాగన్ పండ్ల తోటలకు 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. ఆమె వెంట టెక్నికల్ అసిస్టెంట్ డి.రాములు, రైతు ప్రభాకర్ ఉన్నారు.

జోరు వాన

● జిల్లాలో 19.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
● ప్రాజెక్టులకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో
● కడెం ప్రాజెక్టులోకి 30 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు
● మూడు గేట్ల ఎత్తివేత


కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్న దృశ్యం


స్వర్ణ ప్రాజెక్టు గేటు ద్వారా వరద నీటిని వదిలిపెడుతున్న దృశ్యం

ఖానాపూర్/కడెం/సారంగాపూర్ ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళవారం రాత్రి జోరుగా వర్షం కురిసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా బుధవారం 19.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో ప్రాజెక్టులలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి చేరుతున్న వరద నీటితో క్రమేపి ప్రాజెక్టుల నీటిమట్టం పెరుగుతోంది. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వసామర్థ్యం 4.699 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 3.771 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 30,998 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు మూడువరద గేట్లను ఎత్తి 18,235 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జిల్లాలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1.83 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.384 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 610 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుందని అధికారులు చెబుతున్నారు. స్వర్ణ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.037 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.002 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 394 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుందని అధికారులు చెబుతున్నారు. దస్తురాబాద్ మండలంలో అత్యధికంగా 38.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

● కడెం : కడెం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరడంతో కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 700ల అడుగులు కాగా ప్రస్తుతం 696.925 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రాజెక్టుకు 40,066 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడు వరద గేట్లు ఎత్తి దిగువన ఉన్న గోదావరిలోకి 18,007 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

● సారంగాపూర్ : మండలంలో గల స్వర్ణ ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి స్వర్ణ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు మొత్తం నీటి సామర్థ్యము 1183 అడుగులకు గాను 1182.8 అడుగుల వరద నీరు వచ్చి చేరడంతో బుధవారం ఉదయం ప్రాజెక్టు గేటును ఎత్తి 200వేల క్యూసెక్కుల వరద నీరును దిగువ ప్రాంతానికి వదిలి పెట్టినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం 1000వేల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది.

మాదకద్రవ్యాల నిర్మూలన కోసం కృషి

● అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నషాముక్త్ భారత్ అభియాన్
● జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల


జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్సై లింబాద్రి

నిర్మల్‌రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగ నిర్మూలనపై ఒక విశేషమైన సామూహిక అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది స్థానిక పాఠశాలల్లో, కళాశాలల్లోని విద్యార్థులతో, ఉపాధ్యాయులతో గ్రామాల్లో, పట్టణాల్లో, బస్టాండ్‌లలో ప్రజల చేత మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా, మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంతో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత సమాజాన్ని అనుసరిస్తానని ప్రజలతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది మాట్లాడుతూ... ప్రజలకు మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే ఆరోగ్య నష్టం, కుటుంబాలకు, సమాజానికి కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో పోలీసులతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత, మహిళలు, గ్రామాల్లోని ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నషా ముక్త భారత్ అభియాన్ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం కళాశాలలో మాదక ద్రవ్యాలు వినియోగించని భారత దేశం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మద్యం మత్తులో పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని అదేవిధంగా తమ దృష్టికి వచ్చిన ఎక్కడైనా ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగం చేస్తే ఆ విషయాన్ని ప్రభుత్వ అధికారులకు తెలియజేసి డ్రగ్స్ వినియోగ రహిత సమాజం కోసం కృషి చేయాలని చెప్పడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాదక ద్రవ్య వినియోగ నిరోధక కమిటీ కన్వీనర్ కుంట శ్రీహరి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్, అధ్యాపకులు సూర్యసాగర్, హేమలత, రజిత పాల్గొన్నారు. పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాల వినియోగ రహిత సమాజం కోసం కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకట్ రెడ్డి తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులు సమాజంలో మాదకద్రవ్యాల నిరోధానికి కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి మూడారపు పరమేశ్వర్ అన్నారు. మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞలో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఈద్‌గాంలో విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి : ఎస్పీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

భైంసా, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల నిమిత్తం పోలీసుస్టేషన్లకు వచ్చే బాధితులకు కాలయాపనకు తావు లేకుండా సత్వరంగా న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ డా.జానకీ షర్మిల ఆదేశించారు. బుధవారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో గ్రీవేన్స్ డే కార్యక్రమం నిర్వహించి ఆర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమక్షంలోనే ఎస్‌హెచ్‌వోలు ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. ఇందులో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్‌తో పాటు పలు పోలీసు స్టేషన్ల సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా అధికార యంత్రాంగం


మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలిస్తున్న కమిషనర్

భైంసా, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్య, ఇరిగేషన్ శాఖాధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తతతో ఉన్నారు. కార్యాలయాల పరిధిలోనే మకాం వేసారు. మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ కార్యాలయంలోని ఇంజనీరింగ్, పారిశుధ్య, విద్యుత్ విభాగాల ఇన్‌ఛార్జీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి భారీ వర్షాల నేపథ్యంలో అనుసరించాల్సిన విషయాలపై దిశ,నిర్దేశం చేశారు. తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ రెవెన్యూ అధికార యంత్రాంగానికి అప్రమత్త చర్యలపై జాగృతపరచారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు డిప్యూటీ ఇంజనీర్ అనిల్ కుమార్ ప్రాజెక్టు నిర్వాహణాధికారులు, సిబ్బందితో ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ అప్రమత్త చర్యలను చేపట్టారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, పోలీసు సీఐ గోపినాథ్, అగ్నిమాపక శాఖాధికారి రవిలు తమ తమ సిబ్బందిని అన్ని విధాలుగా సిద్ధం చేశారు. తమ శాఖల పరిధిలోని అధికారులు, సిబ్బందిని అన్ని వేళల అందుబాటులో ఉండేలా ఆదేశించారు. భారీ వర్షాల మూలంగా వరదలు వస్తే ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను వివరించారు.

విద్యార్థుల భవిష్యత్తుకు కృషి : వీసీ గోవర్ధన్


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బాసర, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : 2025-26 విద్యాసంవత్సరానికి ప్రవేశం పొందిన పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం బుధవారం యూనివర్సిటీ అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గౌరవ ఉపకులపతి ప్రొఫేసర్ గోవర్ధన్, ఓఎస్‌డీ ప్రొఫేసర్ మురళీ దర్శన్‌తో కలిసి హాజరై, విద్యార్థులకు ఉద్దేశించి ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా ఉపకులపతి ప్రొఫేసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఇక్కడ ప్రకృతి అందంగా ఉంది. అలాగే జీవితం కూడా ఉన్నత విద్యతో మరింత అందంగా మారుతుందని అన్నారు. విశ్వవిద్యాయం గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు అధిక ప్రాధాన్యతనిస్తూ వారికి శ్రేష్ఠమైన విద్యను అందిస్తోందన్నారు. మా లక్ష్యం ఉన్నతమైన విద్య అందరికి అందించాలన్నది. దీన్ని సాధించేందుకు మా శిక్షణా విధానం నిర్వహణ వ్యవస్థ, ఆధ్యాపక బృంధం అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. సిబ్బంది తమ జీవితాలను విద్యార్థుల అభివృద్ధి కోసం అంకితమవుతున్నారని పేర్కొన్నారు. మీరు ఇల్లు వదిలి ఇక్కడకు వచ్చారు, అయితే భయపడాల్సిన అవసరం లేదు. మేము మీకు తల్లిదండ్రుల్లా ఉంటాం. ప్రతి చిన్న సమస్యకైనా మేము వెంటనే స్పందిస్తాం. విద్య అనే శక్తి, ఆ శక్తిని తెలుసుకోవాలి, అభివృద్ధి చెందాలి. మనం ఎప్పటికి నేర్చుకుంటూనే ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా ఓఎస్‌డీ ప్రొఫేసర్ మురళీదర్శన్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజేశ్, ఎస్సై శ్రీనివాస్, ట్రిపుల్‌ఐటీ అధికారులున్నారు.

పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం

● రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా.చంద్రశేఖర్ రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్

నిర్మల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పాలనలో పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్ట్ తప్పనిసరిగా ప్రదర్శించాలని రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ డా.చంద్రశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టంపై రాష్ట్ర సమాచార కమిషనర్ ఆధ్వర్యంలో పీఐవో అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో సమాచార కమిషనర్లు పర్వీన్, భూపాల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందిన జిల్లాల్లో నిర్మల్ ఒకటన్నారు. పీఐవో అధికారులు ప్రజలకు సమయానికి పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. ఆర్‌టీఐ దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా చట్టంలో ఉన్న సమయ పరిమితి లోపల సమాధానమివ్వాలని ఆదేశించారు. సమాచారాన్ని దాచిపెట్టడం, తప్పుడు సమాచారం ఇవ్వడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు. నిర్మల్ జిల్లాలో ఆర్టీఐ అప్పీల్ కేసులను కలెక్టరేట్‌లో కమిషన్ ప్రత్యేకంగా పరిష్కారానికి చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలోని అన్ని పీఐవో అధికారులు చట్టపరమైన నిబంధనలను పూర్తిగా అనుసరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర సమాచార కమిషన్ కమిషనర్లు పర్వీన్, భూపాల్ మాట్లాడుతూ... ఆర్టీఐ చట్టం సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత పీఐవో, ఏపీఐవోలదేనన్నారు. కమిషన్ ఏర్పాటు తర్వాత 18 వేల కేసుల్లో 2,300లకు పైగా పరిష్కరించామన్నారు. అనంతరం సహ చట్టంపై సందేశాలను నివృత్తి చేశారు. సదస్సులో పీఐవో అధికారులకు సమాచార హక్కు చట్ట నిబంధనలు, దరఖాస్తుల పరిష్కారం విధా నం, అప్పీల్ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కమిషనర్లను జ్ఞాపికలతో కలెక్టర్, అధికారులు సత్కరించారు. సమావేశానికి ముందు కలెక్టరేట్ ప్రాంగణంలో కమిషనర్లు, కలెక్టర్ మొక్కలు నాటి నీరు పోశారు. సదస్సు అనంతరం రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ ఆధ్వర్యంలో వివిధ సమాచార హక్కు దరఖాస్తులు, అప్పీల్స్‌పై ఇయరింగ్ (విచారణ) నిర్వహించారు. సంబంధిత పీఐవో అధికారులు, దరఖాస్తుదారుల నుంచి వివరాలు స్వీకరించి తగిన ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ సాంకేత్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, పీఐవోలు, ఏపీఐవోలు, తదితరులు పాల్గొన్నారు.